మురికికూపంగా చెరువులు


మురికినీటితో ఉన్న మన్సూరాబాద్ పెద్ద చెరువు


నీరులేక ఎండిపోయిన్న మన్సూరాబాద్ చిన్నచెరువు


మురుగునీటితో దుర్గంధంగా ఉన్న మన్సూరాబాద్ పెద్దచెరువులో ఏర్పాటు చేసిన నిమజ్జన కొలను

మన్సూరాబాద్: ఒకప్పుడు పరిసర ప్రాంతాలకు మంచినీటిని, సాగు నీటిని అందించిన చెరువులు.. నేడు కలుషితంగా మారి పోయాయి. మన్సూరాబాద్‌లోని పెద్దచెరువు, చిన్నచెరువు గ్రామ అవసరాలను తీర్చుతూ తాగు, సాగునీటిని అందించాయి. విశాలంగా, వరదకాలువలతో ఉన్న నాటి చెరువులు నేడు కుచించుకపోయి, వరదకాలువలు పత్తాలేకుండా పోయి డ్రైనేజీ మురుగుతో నిండి మురికి కుంటగా మారాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కబ్జాలకు గురై కుచించుకు పోయిన మన్సూరాబాద్ పెద్ద చెరువు, చిన్నచెరువు సుందరీకరణకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభంలో నిధులు మంజూరు చేసి చర్యలు ప్రారంభించింది. మినీ ట్యాంక్‌బండ్ తరహాలో పెద్దచెరువును అభివృద్ధి చేసి సుందరీకరణ చేయాలని నాటి పాలకులు నిర్ణయించారు. గత 7 సంవత్సరాలుగా చెరువుల సుందరీకరణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. చెరువులోని విశాల స్థలంలో గణేష్, బతుకమ్మల నిమజ్జనాలకు నిమజ్జన కొలనును, యోగా షెడ్‌ను, టాయిలెట్స్‌ను మాత్రమే ఇప్పటి వరకు ఏర్పాటు చేశారు. చిన్నచెరువులోని వరదకాలువలు కబ్జాకు గురికావడటంతో చెరువులోకి నీరు చేరటం లేదు.

ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

పెద్దచెరువు, చిన్నచెరువు కబ్జాలకు గురికాకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. అమ్మదయ కాలనీ ప్రాంతంలోని కొంత భాగం కోర్టు కేసు నడుస్తుండటంతో పెద్దచెరువులోని ఆ ప్రాంతంలో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయకుండా వదిలేశారు. పెద్దచెరువుల కట్టలపై వాకింగ్ ట్రాక్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల కాలనీల వాసులు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వేళల్లో వాకింగ్ చేసుకునేందుకు వీలుకలిగింది. చెరువు కట్టపై వీధీదీపాలు ఏర్పాటు చేసినా అవి వెలగటం లేదు. చిన్న చెరువులోని వీధీదీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. చిన్నచెరువు కట్టపై ఉదయం వేళల్లో యువత గంజాయి సేవిస్తుండటంతో వాకర్స్ జంకుతున్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌లా తీర్చిదిద్దుతా ..



మన్సూరాబాద్ పెద్దచెరువును ప్రక్షాళన చేసి మిని ట్యాంక్‌బండ్‌లా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేశాము. చెరువులు కబ్జాకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాము. పెద్దచెరువు ప్రాంగణంలో నిమజ్జన కొలను, యోగా షెడ్‌ను, టాయిలెట్స్, వీధీదీపాలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా మార్చా. చెరువు కట్టపై వాకర్స్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టా. పెద్దచెరువుల సుందరీకరణకు జీహెచ్‌ఎంసీ నిధులను మంజూరు చేసింది. పెద్దచెరువును మినిట్యాంక్‌బండ్‌లా మార్చుతా .

– కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్

డ్రైనేజీ మురుగుతో కంపు కొడుతున్నాయి..



పై కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ మురుగుతో మన్సూరాబాద్ పెద్దచెరువు మురికికూపంగా మారింది. నాడు తాగు, సాగు నీటికి నిలయంగా ఉన్న చెరువులు పాలకుల నిర్లక్ష్యంతో డ్రైనేజీ మురుగుతో నిండిపోయాయి. నాడు విశాలంగా ఉన్న చెరువులు కబ్జాలకు గురై నేడు కుచించుకపోయాయి. సుందరీకరణ చేస్తున్నామని గత కొన్నేళ్లుగా పాలకులు ప్రకటిస్తున్నారు... కాని ఆచరణలో మాత్రం శూన్యం. చెరువులు కబ్జాకు గురవుతున్నాయని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదు. కబ్జాదారులకు అండగా నిలుస్తూ కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారు.

నాంపల్లి శంకరయ్య– మన్సూరాబాద్ వాసి

పది పరీక్షలకు అంతా సిద్ధం



హయత్‌నగర్: సోమవారం నుంచి మొదలయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు హయత్‌నగర్ మండల విద్యాధికారి హీర్యా నాయక్ తెలిపారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల పరిధిలో మొత్తం 30 పరీక్షా కేంద్రాలలో 7241 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 410 మంది ఎని చేస్తారని, ప్రతి సెంటర్‌ను ఇద్దరు అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



మన్సూరాబాద్: వాసవీ క్లబ్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్రసీమకాలనీలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ నాయకులు ఎస్‌ఎస్ రావు, అంజిబాబు, అనిల్, లింగమయ్యగుప్తా, నాంపల్లి రమణ, బండారు అశోక్, భాస్కర్, యాదగిరి,బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తా


భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో రూ.85 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించనున్న కాలనీ సంక్షేమ సంఘ భవన నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు జైపాల్ రెడ్డి, వెంకటరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌కు రూ.4.19కోట్ల నిధులు మంజూరు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: రాష్ట్రంలో నియంతృత్వ పాలకులు మారడంతో నూతన ప్రభుత్వంలో అధికారులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తిస్తున్నారని... కార్పొరేటర్లు అడగగానే కమిషనర్, మేయర్ స్పందించి అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి స్పష్టంచేశారు. మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో మరో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంతంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంగా చెరువు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని మండిపడ్డారు. మన్సూరాబాద్ డివిజన్‌కు భారీ ఎత్తున నిధులు మంజూరు చేసిన కమిషనర్ రోనాల్డ్‌రాస్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునగాల హరీష్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, ఎంజాల సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 19. దొండ 28, ఆలు 27, ఉల్లి 22, గోకర 40, దోస 19, సొర 09, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 55, అర్వి 45, మునగ 35, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యాప్సికమ్ 60. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

గుంతలను పూడ్చి వేయాలి


కొత్తపేట గ్రామంలో డ్రైనేజీ కోసం తీసిన గుంతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్..

నాగోలు: కొత్తపేట గ్రామంలో భూగర్భ డ్రైనేజీ లైన్ కోసం తీసిన గుంతలను వెంటనే పూడ్చివేసి ప్యాచ్ వర్క్‌లు పూర్తిచేయాలని జలమండలి అధికారులకు కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. శనివారం కొత్తపేట గ్రామంలో పవన్ కుమార్ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కొత్తపేటలో జలమండలి అధికారులు భూగర్భ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసి చాలా రోజులు గడుస్తున్న ఇంకా రోడ్డు మరమ్మతు చేయకపోవడంతో కాలనీలోని ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు కార్పొరేటర్ పవన్ కుమార్ తెలియజేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పవన్ కుమార్ సమస్యను పరిశీలించి వెంటనే సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి కొత్తపేటలో గతంలో డ్రైనేజ్ లైన్ వేసిన చోట్ల రోడ్డు ప్యాచ్ వర్క్ చేయాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు తెలియజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని మెగాసిటీ పాఠశాలలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలను విద్యార్థుల కళ్లకు కట్టినట్లుగా చూపించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు చూపరుల ప్రశంసలు పొందాయి. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శన నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాసు వైస్ ప్రిన్సిపల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు మంజూరు చేయాలి


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రీన్ పార్క్ కాలనీ వాసులు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు జగన్ రెడ్డి మాట్లాడుతూ గత డిసెంబర్‌లో చేసిన రీ సర్వేను పరగణనలోకి తీసుకొని నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే సరూర్‌నగర్ చెరువులో మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని, చెరువును సుందరీకరించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు.

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి


రక్తదానం శిబిరంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం, కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రక్తదానం వలన ఆపదలో ఉన్నవారి ప్రాణాలను నిలబెట్టవచ్చని, రాష్ట్రంలో ప్రతిరోజు తగిన రక్తం లభించక పోవడం వలన అనేక మంది ప్రాణాలు పోతున్నాయని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో శనివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదండరాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల కేవలం చదువుకాకుండా మానవతా విలువలు చాటవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 2019 పుల్వామా అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుని వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొట్టం కూల్చివేత


ప్రభుత్వానికి కట్టిన డీడీలను చూపిస్తున్న బాధితులు

ప్రభుత్వ స్థలంలో వేశారంటూ నేలమట్టం చేసిన పోలీసులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ భూమిలో నిర్మించిన పశువుల కొట్టాన్ని పోలీసులు కూల్చివేశారు. కాపర్లను స్టేషన్‌ను తరలించారు. ఈ సంఘటన బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.

బాలాపూర్ రెవెన్యూ అల్మాస్‌గూడలోని సర్వే నంబర్ 86/1లో 750 గజాల్లో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రేకుల షెడ్డును పోలుసులు నేలమట్టం చేయగా.. క్రమబద్ధీకరణ పేరుతో రూ.లక్షలు కట్టించుకుని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చారంటూ బాధితులు ఆరోపించారు.

రూ.1.50 లక్షలు చెల్లించాం..

2015లో జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేసుకుని, ప్రభుత్వానికి రూ.1.50 లక్షలు డీడీ రూపంలో చెల్లించామని బాధితులు రామిడి అనంతరెడ్డి, భిక్షపతిరెడ్డి తెలిపారు. 20 ఏళ్లగా గ్రామ పంచాయతీకి, కార్పొరేషన్‌కు పన్నులు కడుతూనే ఉన్నామని వెల్లడించారు. ఇన్ని రకాలుగా డబ్బు చెల్లించినా ఇప్పుడు షెడ్డు కూల్చేయడమేంటని, అలాంటప్పుడు జీఓ ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. ఖాళీ చేయమంటే తామే వెళ్లేవారమని, ఉన్నఫలంగా ఇలా షెడ్డును కూల్చేస్తే.. తమ జీవనోపాధి ఏం కావాలని వాపోయారు. ఇది కొందరు కావాలనే చేయించారని అనుమానం వ్యక్తంచేశారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌లో వాదులు, ప్రతివాదులు ఏకాభిప్రాయంతో తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా.పట్టాభి రామారావు, రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కస్తూరి బాయ్, ఏపీపీ రాజిరెడ్డి, సుపీత బర్ల, న్యాయమూర్తులు, న్యాయవాదుల, పారా లీగల్ వాలంటీర్స్, కక్షిదారులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఇందిర తెలిపిన మేరకు.. శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 33 లోక్ అదాలత్ దర్మాసనాలు ఏర్పాటు చేయగా అందులో రాజీకి ఆమోదయోగ్యమైన సుమారు 15 లక్షల క్రిమినల్, సివిల్, మోటర్ వాహన ప్రమాద బీమా,బ్యాంకు రికవరీ, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారన్నారు. కక్షిదారులకు మొత్తం రూ. 6కోట్ల 25లక్షలు నష్ట పరిహారం చెల్లించినట్లు తెలిపారు.

చదువే భవిష్యత్తుకు పునాది



మహేశ్వరం: మంచిగా చదువుకుని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కరస్పాండెంట్ విమల అన్నారు. శనివారం మండల పరిధి తుక్కుగూడ మిలినీయం పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలో ఉన్నత స్థానం సంపాదించాలంటే, విద్యార్థి దశ నుంచే కష్టపడాలని సూచించారు. ప్రాథమిక దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించేందుకు కష్టపడి చదవాలని చెప్పారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వాడవాడలా వికసిత్ భారత్ ప్రచారం


డిజిటల్ ప్రచారం వాహనంతో నాయకులు

చంచల్‌గూడ: లోకసభ ఎన్నికల్లో 400పై చిలుకు స్థానాలు సాధించడమే ముఖ్య లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు తంగెళ్ల సుధీర్ అన్నారు. ఆదివారం కుర్మగూడ డివిజన్ పరిధిలో వికసిత్ భారత్ ప్రచారంలో భాగంగా డిజిటల్ ప్రచారం వాహనం ఇంటింటి తిరిగింది. నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టే పనులకు సంబంధించి వివరాలను ప్రచారం చేస్తున్నట్లు సుధీర్ తెలిపారు.

కవిత అరెస్టు పట్ల నిరసన


ఐఎస్ సదన్ చౌరస్తాలో ..

చంచల్‌గూడ: కేంద్ర ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కక్ష్య సాధింపులకు పాల్పడుతుందని ఐఎస్ సదన్ టీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్‌రెడ్డి అన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఈడీ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసిన నేపథ్యంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐఎస్ సదన్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈడీ, మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ కవితను కావాలనే లిక్కర్ కేసులో ఇరికించారన్నారు. ఈ కార్యక్రమంలో కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు డి. నర్సింగ్‌రావు, నాయకులు మెట్టు భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మయ్య తదితరులున్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

చార్మినార్: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో మక్కా మసీదు, చార్మినార్ పరిసరాల్లో సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అంతేగాకుండా మక్కా మసీదులో జరిగే సామూహిక ప్రార్థనల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

మ్యాన్‌హోల్..ప్రమాదాలకు కేరాఫ్

అటు వైపు చూడని అధికారులు


గడ్డిఅన్నారం ప్రభుత్వ పాఠశాల వద్ద..


మలక్‌పేట పోస్టాఫీసుకు వెళ్లేదారిలో..


మూసారంబాగ్ మెట్రో మాల్ ఎదురుగా..

మలక్‌పేట: మ్యాన్‌హోళ్ల దెబ్బతిని ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ఆదమరిస్తే అంతే సంగతులు. అధికారుల పర్యవేక్షణ కొరవడి మ్యాన్‌హోళ్లు అధ్వానంగా తయారయ్యాయి. పాడైన మ్యాన్‌హోళ్లు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడ్డిఅన్నారం ప్రభుత్వ పాఠశాల వద్ద, మలక్‌పేట పోస్టాఫీసుకు వెళ్లేదారిలో, మెట్రోమాల్ వద్ద, సలీంనగర్ రత్నంబస్తీ తదితర ప్రాంతాలలో మ్యాన్‌హోల్స్ ఈదుస్థితి నెలకొంది. నాణ్యతలేని కారణంగా ఇటీవల మరమ్మతులు చేపట్టిన మ్యాన్‌హోల్స్ కూడా పాడై లోపకి కుంగి పోతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారుల్లో చిత్తశుద్ధి లోపించి పరిష్కారానికి నోచుకోవడం లేదు. నామమాత్రం తనిఖీలతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మ్యాన్‌హోల్స్‌ను బాగు చేయాలి: శివరాజ్, సలీంనగర్



మ్యాన్‌హోల్స్ చెడిపోయి ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోరు. నెలల తరబడి సమస్యలు ఉన్నా అధికారుల్లో ఉలుకు పలుకు ఉండదు. ఇటీవల నిర్మించిన మ్యాన్‌హోల్స్ కూడా నాణ్యతలేని కారణంగా చెడిపోతున్నాయి. సమస్య తీవ్రతను పరిగణలోకి తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన మ్యాన్‌హోల్స్‌ను సత్వరమే బాగుచేయాలి.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును కూల్చివేయాలి


శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

చైతన్యపురి: దశాబ్దాల క్రితం నిర్మించిన మంచినీటి వాటర్ ట్యాంక్ కూల్చివేయాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. న్యూమారుతీనగర్ కాలనీ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న వాటర్ ట్యాంక్ వాడుకలో లేకపోవటంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉందని దేవాలయ నిర్వాహకులు, కాలనీవాసులు ఫిర్యాదు చేయటంతో శనివారం మల్‌రెడ్డి పరిశీలించారు. గతంలో ఇదే విషయాన్ని గత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు తెలిపారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయని, అధిక సంఖ్యలో దర్శనానికి భక్తులు వస్తుంటారని అన్నారు. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోక ముందే కూల్చివేయాలని కోరారు. జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని, అవసమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చర్యలు తీసుకునేలా చూస్తానని మల్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.మల్లేశం, సెక్రటరి కామేశ్వరరావు, దేవాలయ వైస్ చైర్మన్ వి.మురళీధర్‌రావు, పి. గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, నాయకులు సురేందర్‌రెడ్డి, మంజురెడ్డి, బాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు సరికాదు


ఎల్‌బీనగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నేతల నిరసన

మన్సూరాబాద్: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయటం సరికాదని, అరెస్టు అక్రమమని ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బీఆర్‌ఎస్ నేతలు నిరసనను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా ఈడీ హడావుడిగా కుట్రపూరితంగా, రాజకీయ కక్ష సాధింపుగా అరెస్టు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ అగ్రనేతలు కవితను అరెస్టు చేశారని, బీజేపీ బెదిరింపులతో బెదరేదిలేదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు తూర్పాటి చిరంజీవి, ఎలుకొండ రాంకోటి, బాలాజీ గైక్వాడ్, బీఆర్‌ఎస్ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.